

యుద్ధ సన్నద్ధతపై నేడు మాక్ డ్రిల్స్

» జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్ (కాకినాడ), మే 6(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునే యోచనలో ఉన్న భారత్ శత్రువులు ప్రతిదాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశాలతో జిల్లాలో ప్రజల రక్షణ విషయమై బుధవారం మాక్‌డ్రిల్స్ నిర్వహించనుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. వాయు, జల, భూమార్గాల్లో దాడులు జరిగినప్పుడు ప్రజలకు ఎలా సమాచారం ఇవ్వాలో, ప్రజలు ఎలా రక్షణచర్యలు తీసుకోవాలో దండోరా ద్వారా వివరించాలని తహసీల్దార్లకు, పోలీసులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థపట్ల కూడా ప్రజలకు మాక్ డ్రిల్స్‌లో అవగాహన కల్పిస్తారని తెలిపారు.

మీరే మేటి అథ్లెట్!



సాధన చేస్తున్న చిన్నారులు

» నేడు ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం 6

ఏపీఈఏపీసెట్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు రేపటి వరకు గడువు

» ఈనెల 12 నుంచి హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్ 6

» 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ

అన్నవరంలో నేటినుంచి సత్యదేవుడి కల్యాణోత్సవాలు ప్రారంభం 7



రత్నగిరిపై స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం కోసం సిద్ధం చేసిన కొబ్బరిబొండాలు

క్యాన్సర్ కలవరం!



ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తోన్న మహమ్మారి

» వేలల్లో అనుమానిత కేసులు
» 2.0 సర్వేలో 16,432
» 3.0. సర్వేలో 21వేలుపైనే
» కాకినాడలోనే 8,383 కేసులు
» 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ
» రాష్ట్రంలోనే కాకినాడ జిల్లా ఫస్ట్
» ఆసుపత్రి ఏర్పాటు యోచన
» రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
» కాకినాడ కలెక్టర్ చొరవ
» క్యాన్సర్ పరీక్షలకూ వాహనం

క్యాన్సర్.. ఎప్పుడు వస్తుందో.. ఎక్కడ వస్తుందో.. ఎలా వస్తుందో తెలియదు.. ఏదో అనుమానం ఉంటే తప్ప ప్రాథమిక దశలో గుర్తించడం కూడా కష్టమే. నూటికి 50 నుంచి 60 శాతం కేసులు చివరిలోనే గుర్తిస్తారు.. దాంతో సకాలంలో చికిత్స అందక క్యాన్సర్‌కు ఎందరో బలైపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిపిన సర్వే విస్తుపోయే నిజం బయటకు వచ్చింది.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తోందని తేలింది.. కాకినాడ క్యాన్సర్ అనుమానిత కేసుల్లో తొలిస్థానంలో ఉంటే.. తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలు 10, 11వ స్థానాల్లో ఉండడం కలవరపెడుతోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ అనుమానిత కేసులు కలవరపెడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ సర్వేలో వేలకు వేలు అనుమానిత కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఏ మండలంలో చూసినా నోటి, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న బాధితులు ఎక్కువగా తేలుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనబుల్ డిసీజ్) 2.0 సర్వేలో ఉమ్మడి జిల్లాలో 16,432 మందిలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించగా తాజాగా పూర్తయిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఏకంగా 20వేలకుపైగా కేసులు వెలుగులోకి రావడం క్యాన్సర్ తీవ్రతను చాటుతోంది.

అంతకంతకూ విజృంభణ..

రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో క్యాన్సర్ కేసులు విజృంభిస్తున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం జనవరిలో ఆదేశించింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్యాన్సర్‌తోపాటు పలు రకాల వ్యాధులపై సర్వే చేశారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, లివర్ వ్యాధులు సైతం భారీగా ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి వస్తున్నా వీటికి మించి భయపెట్టేలా క్యాన్సర్ అనుమానిత కేసులు గుర్తిస్తుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

రాష్ట్రంలో కాకినాడ ఫస్ట్..

కాకినాడ జిల్లాలో అత్యధికంగా కేసులు ఉండడం కలవరపెడుతోంది. 2.0 సర్వేలో కాకినాడ జిల్లాలో 6,333 కేసులు గుర్తించారు. 3.0 సర్వేలో ఏకంగా 8,383 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు వీరిలో చాలామందికి పూర్తిస్థాయి టెస్టులు చేయగా 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఇన్ని కేసులతో కాకినాడ జిల్లా రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. ఈనేపథ్యంలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధులు వేగంగా విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎస్సార్ నిధుల ద్వారా ప్రత్యేక క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్టులు జరిపే మొబైల్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓఎన్జీసీతో మాట్లాడారు. ఈ మొబైల్ వాహనం ద్వారా రోజుకు వెయ్యిమందికి టెస్టులు చేసే ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మందికి టెస్టులు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. తూర్పుగోదావరి జిల్లా 5,103 అనుమానిత క్యాన్సర్ కేసులతో పదో స్థానంలో నిలిచింది. కోనసీమ జిల్లా 4,996 కేసులతో 11వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో క్యాన్సర్ అనుమానిత కేసులు 16,432 తేలాయి.

ఉమ్మడి జిల్లాలో అనుమానితులు 21 వేలు

● గత మార్చిలో ప్రభుత్వం మూడో దశ ఎన్‌సీడీ సర్వే చేపట్టింది. ఈ సర్వేలోనూ క్యాన్సర్ అనుమానిత కేసులు ఉమ్మడి జిల్లాలో ఏకంగా 21 వేలు గుర్తించారు. కాకినాడ జిల్లాలో అయితే 3.0 సర్వేలో ఏకంగా 8,383 అనుమానిత కేసులు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,995, బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 2,337, సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 2,051 మంది అనుమానితులుగా గుర్తించారు. వీరిని కాకినాడ జీజీ హెచ్‌కు రిఫర్ చేశారు. ఇలా ఓరల్ క్యాన్సర్ పరీక్షలకు పంపిన 56 మందిలో 12 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 78 మందిలో ఐదుగురికి క్యాన్సర్‌గా తేలింది. సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 21 మందిలో నలుగురికి వ్యాధి నిర్ధారణ అయింది.

● తూర్పుగోదావరి జిల్లాలో 6,413 మందిలో అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,186 అనుమానిత కేసులు గుర్తించగా లోతైన వైద్య పరీక్షలకు 44 మందిని రాజమహేంద్రవరం జీజీహెచ్ అంకాలజీకి రిఫర్ చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 1,800 అనుమానిత కేసులుండగా 97 మందిని లోతైన టెస్టులకు రిఫర్ చేశారు. సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 1,427 అనుమానితులను గుర్తించగా 24 మందిని జీజీహెచ్‌కు పంపారు. ఈ అనుమానిత కేసుల్లో నలుగురికి బ్రెస్ట్ క్యాన్సర్, మరో నలుగురికి ఓరల్ క్యాన్సర్ నిర్ధారణ అయింది. మిగిలిన వారికి పరీక్షలు జరుగుతున్నాయి.

● కోనసీమ జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో 4,996 కేసులు గుర్తించగా తాజా సర్వేలో ఐదు వేలకుపైగా అనుమానితులను గుర్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనుమానిత కేసులు, నిర్ధారణ అవుతున్న కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. బాధితుల్లో ఎక్కువగా 40 నుంచి 64 ఏళ్ల మధ్య వయసున్న వారు అధికంగా ఉంటున్నారని తేలింది.



బలభద్రపురంలో క్యాన్సర్ పరీక్షలు (ఫైల్)


అసెంబ్లీ వేదికగా బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. సుమారు ఆ ఒక్క గ్రామంలో 40 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించి ఆసుపత్రులకు తరలించారు. ఆ గ్రామంలో కేసులు వేలల్లో ఉంటాయని వాదన.

రూ.10 కోట్లతో ఆసుపత్రి..

క్యాన్సర్ విజృంభణ కారణంగా కాకినాడలో ప్రత్యేకంగా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించాల్సి ఉందని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపారు. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం జీజీహెచ్‌కు సమీపంలో ఉందని నివేదికలో వివరించారు. కాకినాడ జీజీహెచ్ అంకాలజీ విభాగంలో నిపుణులైన క్యాన్సర్ వైద్యులు ఉన్నారన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ స్ర్కీనింగ్ చేస్తారు. అనుమానితులు వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. ఈ కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉంటారు. పరీక్షించి వెంటనే ఫలితం చెబుతారు.

కొత్త రేషన్‌కార్డులకు..

వేళాయె..



» నేటినుంచే దరఖాస్తులు ప్రారంభం
» నెలరోజులపాటు స్వీకరణ
» కొత్తకార్డులతోపాటు మార్పులు, చేర్పులకు అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొన్నేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి శుభవార్త చెప్పింది. కొత్తకార్డుల జారీతో పాటు రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పునకు అవకాశం కల్పిస్తున్నట్టుగా పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం వెల్లడించారు. బుధవారంనుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. నెలరోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 6లక్షల43వేల 874మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారు. వారిలో అంత్యోదయకార్డులు 22,375ఉన్నాయి. చాలాఏళ్లుగా అనేకమంది రేషన్ కార్డులకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే కచ్చితంగా రేషన్‌కార్డు తప్పనిసరి. నిత్యావసరాల వస్తువులు తీసుకోవడమే కాదు.. ఆరోగ్యపరమైన అవసరాలకూ కీలకం కావడంతో చాలా కుటుంబాలకు ఈకార్డే ఆధారం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అనేకమంది ఈ రేషన్‌కార్డులకోసం నిత్యం అధికారులకు దరఖాస్తులు చేస్తూ వస్తున్నారు. కార్డుల్లో కుటుంబసభ్యుల చేరిక, మార్పులు, చేర్పులు సమస్యలపైనా అనేకమంది జిల్లా అధికారులకు వినతులు సమర్పిస్తున్నారు. ప్రతి సోమవారం కాకినాడ జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు వచ్చే అర్జీల్లోనూ చాలా వరకు రేషన్‌కార్డుల మంజూరు కోరుతూ వచ్చిన వినతులే అధికంగా ఉంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన 11నెలల కాలంలో వేల సంఖ్యలో దరఖాస్తులు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారుల వద్దకు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబర్ వరకు మాత్రమే కొత్తరేషన్‌కార్డులు జారీ చేసింది. కొన్నింటిని అనర్హులుగా చూపించి రద్దు చేసింది. అప్పట్లో జిల్లాలో 12 వేల వరకు రేషన్ కార్డులు మంజూరు చేశారు.

ఈకేవైసీకి దూరం

జిల్లా 18లక్షల31వేల680మంది కుటుంబసభ్యులు రేషన్‌కార్డుల్లోఉన్నారు.16లక్షల88వేల612మందికి ఈకేవైసీ పూర్తయ్యింది. ఇంకా లక్షా15వేల256మందికి అనుసంధానం చేయాలి. జిల్లాలోని 21మండలాల పరిధిలో కాకినాడ అర్బన్‌లో అత్యధికంగా 14వేలమందికి ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. కాకినాడ గ్రామీణంలో 10వేలు, సామర్లకోటలో 8వేలు, పిఠాపురంలో 8వేలు, తునిలో 7500 మంది అత్యధికంగా ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నారు. మిగతా మండలాల్లో 2వేలనుంచి 7వేల వరకు ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉంది. ఇది జరగకపోతే కార్డుల్లో సభ్యులకు సరకులు నిలిచిపోవడం, పేర్లు తొలగించే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఇద్దరు అధికారులు బదిలీ

కలెక్టరేట్(కాకినాడ), మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి బదిలీపై విశాఖపట్నం స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీగా నియమితులయ్యారు. విపత్తుల నిర్వహణశాఖ డీపీఎం మమ్మీను బదిలీ చేశారు. ఆమెను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమించారు.

8నుంచి 10వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

» జిల్లా పంచాయతీ అధికారి

కార్పొరేషన్(కాకినాడ), మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 8నుంచి 10వతేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ మంగళవారం అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గ్రామాల్లో నీటి ట్యాంకులు శుభ్రపరచడం, పైపులైను లీకేజీల గుర్తింపు, మురుగునీరు డ్రైనేజీల లీకేజీల గుర్తింపు, మరమ్మతులు వంటి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ల ఆదేశాల మేరకు డీపీవో జిల్లాలోని డిప్యూటీ మండల పరిషత్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ



కాకినాడలో ఉచిత శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులు

» సాంఘిక సంక్షేమశాఖ నిర్వహణలో ఉచిత వసతి సౌకర్యం కూడా..
» ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మాత్రమే
» జిల్లాకు రెండు సెంటర్లు కేటాయింపు
» ఇప్పటికే కోచింగ్ ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ), మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల తరువాత డీఎస్సీ నోటిఫికేషన్ పడింది. మరి కోచింగ్? పేద అభ్యర్థులకు పెద్ద సమస్యే కదా.. సరైన శిక్షణ లేకపోతే సీటు సాధించలేరు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం ఇచ్చింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వారికి ఉచిత శిక్షణతోపాటు వసతి కల్పిస్తోంది.

మార్చి 23నే ప్రారంభం

ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ-2025ను ప్రకటించింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ద్వారా 5వేల మందికి హాస్టల్ వసతితో కూడిన ఉచిత శిక్షణ, వసతిని మూడునెలల పాటు ఇస్తోంది. దీంతో అభ్యర్థులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 23వతేదీ నుంచే కోచింగ్ ప్రారంభించారు. దీని నిమిత్తం రాష్ట్రంలో దాదాపు 18 కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాకు రెండు కోచింగ్ సెంటర్లను కేటాయించారు. అభ్యర్థులు వెబ్‌ఆప్షన్ల ద్వారా వారికి నచ్చిన సెంటర్లను ఎంచుకునే వెసలుబాటు అభ్యర్థులకే ఇచ్చారు. అభ్యర్థులు రాష్ట్రంలోని ఏ జిల్లాలోనైనా వారికి నచ్చిన కోచింగ్ సెంటర్లో శిక్షణ తీసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే ఆయా సెంటర్లలో ఉచిత కోచింగ్‌కు అభ్యర్థులు చేరిపోయారు.

కాకినాడలో రెండు సెంటర్లు

కాకినాడలో రెండు ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రభుత్వం కేటాయించగా ఒకటి శ్యామ్ ఇనిస్టిట్యూట్, రెండు ఆదిత్య కళాశాల. వివిధ జిల్లాల నుంచి 300మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఒక్కో సెంటర్‌లో చేరి ఉచిత శిక్షణ, వసతి పొందుతున్నారు. రోజుకు 8గంటలపాటు క్లాసులు నిర్వహణ, 6గంటలపాటు స్టడీ నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణతోపాటు డైలీ టెస్టులు నిర్వహిస్తున్నారు. హాస్టల్, భోజన వసతి కూడా కల్పించడంతో అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత కోచింగ్‌కు ఆన్‌లైన్ యాప్ కూడా..

డీఎస్సీ అభ్యర్థులు ఉచిత కోచింగ్ పొందేందుకు ఆన్‌లైన్‌లో ఓ యాప్ ఉంది. కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన ఆచార్య యాప్ ద్వారా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ పొందవచ్చని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. కాగా, ఈ యాప్‌ను రాజధాని అమరావతిలోని సచివాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సబిత ప్రారంభించారు.

ఇన్నేళ్ల తర్వాత మెగా డీఎస్సీ

-ఎం.శాంతి, పెద్దాపురం



ఇన్నేళ్ల తర్వాత ప్రకటించిన ఈ మెగా డీఎస్సీలో కచ్చితంగా ఉద్యోగంసాధిస్తాను. ఉచిత శిక్షణ, వసతి ఉపయోగకరంగా ఉన్నాయి.

సద్వినియోగం చేసుకుంటాను

-బి.అశోక్, విజయనగరం



డీఎస్సీ కోచింగ్ ఖర్చుతో కూడుకున్నపని.రాష్ట్రప్రభుత్వం కల్పించిన ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని స్వదినియోగం చేసుకుంటాను.

ఆనందంగా ఉంది

-పి.సుమలత, ప్రకాశం



డీఎస్సీ నోటిఫికేషన్‌తోపాటు ప్రభుత్వం ఉచితశిక్షణ, వసతి కల్పించినందుకు ఆనందంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

ప్రశాంతంగా ఏపీఈసెట్-2025 ప్రవేశ పరీక్ష

» ఐదు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ
» 1809మంది విద్యార్థులు హాజరు
» 98.32శాతం హాజరు నమోదు

కాకినాడ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలకోసం మంగళవారం అనంతపురం జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఏపీఈసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బీ.దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లాలో ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య యూనివర్శిటీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ,ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, సాఫ్ట్ టెక్నాలజీ మొదలైన 5పరీక్షాకేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు 920మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 907మంది హాజరుకాగా 13మంది పరీక్షరాయలేదని తెలిపారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు 920మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 902మంది హాజరుకాగా 18మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1,840 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,809 మంది హాజరుకాగా 31 మంది పరీక్షరాయలేదని మొత్తం 98.32శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు.

వాకలపూడిలో రూ.9.60 కోట్లతో ఎఫ్ఎఫ్‌సీ పార్కు

» నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

సర్పవరంజంక్షన్, మే6(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్నతరహా వ్యవస్థాపకులు, నిరుద్యోగ యువత పారిశ్రామిక వ్యాపారాలకోసం మౌలిక సదుపాయాలు కల్పించి 2030నాటికి ఒక వ్యవస్థాపకుడు-ఒకకుటుంబం అనే నినాదంతో సీఎం చంద్రబాబు ఎంఎస్ఎంఈ, ఎఫ్ఎఫ్‌సీలు ఏర్పాటు చేస్తున్నట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మంగళవారం వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో ఏపీఐఐసీకి చెందిన 2.99 ఎకరాల పరిధిలో 26వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.9.60కోట్లతో నిర్మించనున్న బహుళఅంతస్తుల పారిశ్రామికభవనం(ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్ఎఫ్‌సీ) నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడంద్వారా చిన్నపారిశ్రామిక యూనిట్ల స్థాపనతో పారిశ్రామికవేత్తలుగా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు సీఎం చంద్రబాబు ఎఫ్ఎఫ్‌సీలను మంజూరు చేశారన్నారు. తొలి విడతగా రాష్ట్రంలో 38మంజూరు కాగా ఇందులో కాకినాడరూరల్‌కి ఎఫ్ఎఫ్‌సీ పార్కు మంజూరు చేయడం అదృష్టమన్నారు.ఒకే ప్రాంగణంలో 200 మంది వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ సహకారంతో సుస్థిర అభివృద్ధి సాధించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కోరారు. పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకుల పారిశ్రామిక అవసరాల కోసం ఎంఎస్ఎంఈలు, ఎఫ్ఎఫ్‌సీలు వ్యాపార సుస్థిర అభివృద్ధికి దోహదం చేస్తాయని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి తెలిపారు. నియోజకవర్గానికో యూనిట్ మంజూరు కాగా, కాకినాడ రూరల్‌కి యూనిట్ మంజూరయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెక్టోరల్ పాలసీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఒక గొప్పవరమని జిల్లా పరిశ్రమల కేంద్రం జేడీ గణపతి తెలిపారు. ఐడీబీ, ఈడీబీ, ఎంఎస్ఎంఈ పాలసీ ప్రకారం ప్రతికుటుంబంనుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా తయారవ్వాలనేదే సీఎం చంద్రబాబు ప్రధానఉద్దేశమన్నారు. ఈమేరకే ఎంఎస్ఎంఈ, ఎఫ్ఎఫ్‌సీ, నానో పార్కుల ఏర్పాటు అన్నారు. తహశీల్దార్ కుమారి, ఎంపీడీవో సతీష్, గ్రామ కార్యదర్శి పాండురంగారావు, ఈవోపీఆర్డీ శ్రీరామాంజనేయులు, నాయకులు మాదారపు తాతాజీ, బాబూరావు, ప్రసాద్, ఇంద్ర పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, ఏపీఐఐసీ జెడ్ఎం రమణారెడ్డి

వాహ నిజం!

ఇతగాడి మేనరిజం



డబుల్ సైకిల్‌పై సవారీ..



కారుగా మారిపోయిన యాక్టివా...

కలలు కనండి..వాటిని నిజం చేసుకోండి.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాట.. ఆ మాటను ఆచరించే యువత కోకొల్లలు.. ఆ కోవలోకే వస్తాడు రాజ్‌కుమార్.. పుట్టింది కుగ్రామంలో అయినా చిన్నతనం నుంచి ఏదో ఒకటి కొత్తగా చేయాలనే తపన.. అందులో నుంచి పుట్టిందే విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన.. చిన్నతనం కార్లు అంటే చాలా ఇష్టం.. అది మామూలు కార్లు కాదండోయ్.. ఇటీవల కల్కి సినిమాలో బుజ్జి కారు చూశారా.. అలా ఉండాలి.. మరి అటువంటి కార్లు మార్కెట్‌లో లభ్యమవుతాయా.. కష్టమే కదా.. ఉన్నా కొనలేం. అందుకే తన బుర్రకే పదును పెట్టాడు.. ఇదిగో ఇలా తన వద్ద ఉన్న పరికరాలతోనే తనకు నచ్చినట్టు వాహనాలు తయారుచేసుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.. యూట్యూబ్ చానల్ వేదికగా వీక్షకులతో శెహబాష్ అనిపించుకుంటున్నాడు.. - పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి

- పల్లెటూరులో కొత్త..కొత్తగా..షికారు!
- విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన
- చేసింది డిప్లమో అయినా వినూత్నంగా ఆలోచన
- వీక్షకులను ఆకట్టుకుంటున్న నక్కిడిలంక యువకుడు
- 'కోనసీమ సరదాలు' పేరుతో యూట్యూబ్ ఛానల్

సోషల్ మీడియా నేటి తరం యువతకు ఒక అద్భుత వేదిక.. వారిలో ఉన్న టాలెంట్‌ను ఎవరూ గుర్తించనక్కర్లెద్దు.. వారే గుర్తించి.. అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా యువత ఇదే చేస్తున్నారు. వారి నైపుణ్యాలను వివిధ రకాలుగా ప్రదర్శిస్తున్నారు. కొందరు వీడియో లు తీసి సోషల్‌మీడియా ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుల ద్వారా పాపులరై కోర్టు సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ కొట్టేసింది. కోనసీమ జిల్లా సరిహద్దులోని ఆచంట మండలం నక్కిడిలంక యువకుడు రాజ్‌కుమార్.. పరిసరాల్లో దొరికే వస్తువులతో వింతవాహనాలు తయారుచేస్తూ ఆ వీడియోలను యూట్యూబ్‌లో ఔరాఅనిపిస్తున్నాడు.



గల్ఫ్ వెళ్లొచ్చి..

కోనసీమజిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ఆచంట మండలం గోదావరి మధ్యలోని గ్రామం నక్కిడిలంక.. అక్కడ ఒక గ్రామం ఉందని బయట ప్రపంచానికి తెలియడం చాలా అరుదు.. ఎందుకంటే లంక గ్రామం కావడంతో పరిసర గ్రామాల వారికే అవగాహన ఉంటుంది.ఆ గ్రామానికి చెందిన యువకుడు రాజ్‌కుమార్ వినూత్న వాహనాల రూపకల్పన చేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అమలాపురం బీవీసీ కళాశాలలో డిప్లమో పూర్తి చేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి పోయాడు. తిరిగి వచ్చిన తర్వాత తనకు ఉన్న నైపుణ్యంతో వినూత్న వాహనాలను తయారు చేసి యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి చూపించాలన్న ఆలోచనతో ఇటీవలే 'కోనసీమ సరదాలు' పేరుతో ఛానల్ ప్రారంభించాడు. సాంకేతిక పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని తనకు ఉన్న పరిజ్ఞానంతో తన ప్రయత్నాన్ని సఫలం చేసుకుంటున్నాడు.



యువకుడు తయారు చేసిన వెదురుబొంగుల పడవ

కొత్తకొత్తగా ఇలా..

తన స్నేహితుడు మనోజ్ సాయంతో రాజ్‌కుమార్ ఇప్పటి వరకు నాలుగు వినూత్న వాహనాలు తయారు చేశాడు. ఎదురుబొంగులు, ప్లాస్టిక్ కవర్ల సాయంతో పడవను తయారు చేసి వశిష్ఠ నదీ పాయలో విహారం చేశాడు. ఒక సైకిల్‌పై మరో సైకిల్‌ను జోడించి వాటి మధ్య వెల్డింగ్‌తో ఎత్తయిన సైకిల్‌గా రూపకల్పన చేసి గ్రామంలోని రోడ్లపై తొక్కాడు. ఒకేసారి ఐదుగురు ప్రయాణం చేసేలా పొడవాటి స్కూటీని తయారు చేసి సీసీ రోడ్లపై ప్రయాణం చేశాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి స్కూటీ సాయంతో బగ్గి వాహనం(చిన్నకారు) తయారు చేసి రోడ్డుపైకి వచ్చాడు. వాహనాల తయారీలో వెల్డింగ్ దగ్గర నుంచి బిగించే వరకు అన్నీ అతడే స్వయంగా చేసుకోవడం విశేషం. ఒక్కసారి చేసిన వాహ నాన్ని తన యూట్యూబ్ కోసం వీడియో చేసిన తర్వాత నిర్వీర్యం చేస్తాడు.ఆ వస్తువులనే మళ్లీ నూతన వాహనం తయారీకి వినియోగిస్తాడు. ఇలా అద్భుతంగా తీర్చిదిద్దుతాడు. వాహనాలపై పల్లె రోడ్లపై తిరుగుతూ రీల్స్ చేసి వాహ్‌వా అనిపించుకుంటున్నాడు.

పనిలోనే ఆనందం వెతుక్కుంటున్నా : రాజ్‌కుమార్



నాకు చిన్నతనం నుంచి వాహనాలంటే చాలా ఇష్టం.. ఎక్కడైనా కొత్త వాహనాలు కనిపిస్తే తరచి తరచి చూడడం అలవాటు..చిరంజీవి పాత సినిమాల్లో చూస్తే చాలా వాహనాలు కనిపించేవి.. వాటిని మైండ్‌లో పెట్టుకునేవాడిని..ప్రస్తుతం నా వాహనాలకు అదే ప్రేరణ.. పాత వాహనం తీసుకుని దాన్ని రీమోడల్ చేస్తా. డిప్లమో అయిన తర్వాత ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిపోయా. అక్కడ పనిచేసేవాడినే కానీ ఏదో తెలియని వెలితి.. ఎందుకొచ్చిన గొడవ అని వచ్చేశా.. నా టాలెంట్‌నే పెట్టుబడిగా పెట్టి వాహనాలు తయారుచేస్తున్నా.. ఆనందంగా ఉంది.



ఇది లోకల్ మేడ్ వాహనం.. ఎలా ఉందో చూశారా.. ఐరన్ బద్దలు.. యాక్టివా ఇంజన్.. టైర్లు అమర్చి ఐదుగురు ప్రయాణించేలా వాహనం ఇలా..





కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో యువతీయువకుల సాధన

శారీరక బలం, చురుకుదనం, నైపుణ్యంతో

మీరే మేటి అథ్లెట్



ఏ దేశానికైనా యువతే ప్రధాన వనరు. అలాంటి యువత ఆరోగ్యం, ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దేదే క్రీడ. ఏ క్రీడలోనైనా ప్రావీణ్యం సాధించడానికి మౌలికంగా అవసరమయ్యే శక్తి, సామర్థ్యాలకు పర్యావరణ పరిరక్షణ తోడైతే ఆ దేశ ఖ్యాతి ఇనుమడిస్తుంది. పురాతన ఒలింపిక్ క్రీడల్లో అగ్ర భాగం జంప్, జావెలిన్, డిస్కస్‌త్రో పాటు పరుగుదే. బాక్సింగ్, రథాల పోటీలతో పాటు మల్లయుద్ధం ఉండేవి. ప్రపంచ క్రీడా వేదికైన ఆధునిక ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ప్రతి క్రీడాకారుడి కల. ఒలింపిక్స్‌లో సైతం అత్యధిక పతకాలు (48 బంగారు) అథ్లెటిక్స్‌లోనే అందిస్తారు.

నేడు ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం

కార్పొరేషన్ (కాకినాడ), మే 6 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ మొదలైందే అథ్లెట్‌గా అంటే అతిశయోక్తి కాదు. మానవ పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లతో నడవడం ప్రారంభించాడు. మెరుగైన జీవనం కోసం పరుగెత్తాడు. ఆహార అన్వేషణలో భాగంగా విసిరాడు.. దుమికాడు. ఇవన్నీ మనిషి జీవన గమనాన్ని ఊహించలేని స్థితికి చేర్చాయి. నడవడం, పరుగెత్తడం, దుమకడం, విసరడం అనేవి అథ్లెటిక్ ట్రాక్, ఫీల్డ్ అంశాలైనా.. ప్రతి క్రీడలోనూ ప్రాథమిక అంశాలు. క్రీడాకారుడి (అథ్లెట్)గా ఎదిగేందుకు శిక్షణలో శారీరక బలం, చురుకుదనం, నైపుణ్యం ప్రధాన పాత్ర పోషిస్తాయి. అలాంటి అథ్లెట్‌గా పిల్లలు, యువతలో ఫిట్‌నెస్ ప్రాముఖ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ప్రతిఏటా మే 7న ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం జరుపుకుంటున్నాము. 1996లో తొలిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ డేను అంతర్జాతీయ అథ్లెటిక్ అమెచ్యూర్ సమాఖ్య ప్రారంభించింది.

క్రీడలు మానసిక స్థితి, ఏకాగ్రత, నిద్ర అలవాట్లను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి, నిరాశను తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఇది నాయకత్వ లక్షణాలతో ముడిపడి ఉంది. వృద్ధులకు మానసిక ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది.

1985 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పీటీ ఉష ఐదు బంగారు పతకాలు సాధించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో మిల్కాసింగ్ స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతకం సాధించాడు. సియోల్ ఆసియా క్రీడల్లో పీటీ ఉష ఒక రజతం, నాలుగు బంగారు పతకాలను గెలుచుకుంది. 2018 ప్రపంచ యు-20 చాంపియన్‌షిప్‌లో హిమాదాస్ స్వర్ణం గెలుచుకున్నారు. యూనివర్శియేట్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారతీయురాలిగా ద్యుతీచంద్ నిలిచారు.



ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం లక్ష్యాలు

- యువతలో క్రీడలను ప్రాచుర్యం పొందడం. అథ్లెటిక్స్‌కు ప్రోత్సాహం ఇవ్వడం.
- పాఠశాలలు, సంస్థల్లో దానిని ప్రాథమిక క్రీడగా మార్చడం.
- క్రీడల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, క్రీడల ప్రాముఖ్యత, యువతకు విద్యను అందించడం.
- యువత, క్రీడ, పర్యావరణ పరిరక్షణ మధ్య ఒక ముఖ్యమైన సంబంధాన్ని ఏర్పరచడం.



అథ్లెటిక్స్‌కి మంచి రోజులు వచ్చాయి



మన దేశంలో అథ్లెటిక్స్‌కి మంచి రోజులు వచ్చాయి. నేను 1994 నుంచి 1997 వరకు జూనియర్ ఇండియా టీమ్ కోచ్‌గా పని చేశాను. అప్పటికి, ఇప్పటికి చూస్తే సింథటిక్ ట్రాక్‌లు చాలా వచ్చాయి. మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వుంది. కానీ కోచ్‌లు చాలా తక్కువ వున్నారు. 1990లో ప్రతి జిల్లాకి ఒక కోచ్ ఉండేవారు. ఎస్ఏఐ కోచ్‌లు ఉండేవారు. అప్పట్లో అథ్లెటిక్స్ ప్రాక్టీస్ చేసేవారు ఎక్కువ. ప్రస్తుత ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. పూర్వం తరహాలో స్పోర్ట్స్ హాస్టల్స్, అకాడమీలు రానున్నాయి. రాష్ట్రంలో సింథటిక్ ట్రాక్‌ల సంఖ్య పెరగనుంది. కాకినాడ జేఎన్టీయూలో సింథటిక్ ట్రాక్ రెడీ అవుతోంది. జిల్లా క్రీడా మైదానంలో కూడా ట్రాక్‌కి ప్రతిపాదనలను కలెక్టర్ అప్రూవల్‌తో ఖేలో ఇండియా స్కీమ్ కింద పం పించాము. బేసిక్ లెవెల్లో క్రీడాకారులు అథ్లె టిక్స్‌లో చేరితే ఏగేమ్‌లోనైనా రాణించగలరు.

హ్యాపీ వరల్డ్ అథ్లెటిక్స్ డే.

బి.శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో, కాకినాడ

ఏ ఆటకైనా ఫిట్‌నెస్ ముఖ్యం



ఏ ఆట ఆడాలన్నా ముందుగా ఫిట్నెస్ అవసరం. అది అథ్లెటిక్స్ ద్వారానే వస్తుంది. 1999 నుంచి 2004 వరకు రన్నింగ్‌లో సీనియర్ నేషనల్ బ్రాంజ్ మెడల్, 400 మీటర్ల అడల్ట్స్‌లో నేషనల్ రికార్డ్, ఏషియన్ గ్రాండ్‌ప్రిక్స్‌లో బ్రాంజ్ మెడల్, ఆఫ్రో ఏసియన్ గేమ్స్‌లో నాలుగో స్థానం, వరల్డ్ గేమ్స్, సౌత్ ఏషియన్ గేమ్స్.. ఇలా ఎన్నో పతకాలు సాధించాను. 2006 కోల్‌కతాలో కోచింగ్ డిప్లొమా, ఆర్మీ టీమ్‌కి, సర్వీస్ టీమ్‌కి కోచ్‌గా వ్యవహరించాను. 2011 నుంచి 2013 వరకు ఇండియా అథ్లెటిక్స్ టీమ్ అడల్ట్స్, హైజామ్‌కి కోచ్‌గా పని చేశాను. 2017లో వైఎస్సార్ కడప జిల్లా స్పోర్ట్స్ స్కూల్స్‌కి స్పోర్ట్స్ ఆఫీసర్‌గాను, 2018లో నాగార్జున యూనివర్సిటీలో చీఫ్ కోచ్‌గాను విధులు నిర్వర్తించాను. 2019 నుంచి 2023 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ కోచ్‌గా పని చేశాను.

పైడి వరప్రసాద్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్, జడ్డంగి హైస్కూలు



నేటి బాలలే... రేపటి అథ్లెట్లు

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో చిన్నారుల సాధన

ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తులో తప్పుల సవరణకు

రేపటి వరకు గడువు

- మార్పు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం
- మొత్తం 3,60,702 దరఖాస్తులు
- ఈనెల 12 నుంచి హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్
- 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ
- ఏపీ ఈఏపీసెట్ ఛైర్మన్, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్



జేఎన్టీయూకే, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 దరఖాస్తులో ఏమైనా తప్పులుంటే ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మార్పు చేసుకునేందుకు గడువు ఉందని సెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో జరిగే ఏపీ ఈఏపీసెట్‌కు ఇప్పటివరకూ 3,60,702 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో మే 7వరకూ రూ.4000తో 12వ తేదీ వరకు, రూ.10,000 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకూ https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఏపీలో 46, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2 ప్రాంతీయ కేంద్రాలు మొత్తం 48 ప్రాంతీయ కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. దరఖాస్తులో విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరించినట్లయితే వారు ఈఏపీ సెట్ సహాయకేంద్రాన్ని సంప్రదిస్తే కేటగిరి-1కు సంబంధించిన విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, సంతకం, ఫొటో, ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్, విభాగం, కమ్యూనిటీ వివరాలను సవరించనున్నట్టు చెప్పారు. అలాగే కేటగిరి-2కు సంబంధించి ఇంటర్ పూర్తిచేసిన సంవత్సరం, మాధ్యమం, విద్యా వివరాలు, బ్రిడ్జి కోర్సు హాల్ టికెట్ నెంబరు, తల్లి పేరు, జెండర్, ఆధార్, రేషన్ కార్డు వివరాలు, మైనార్టీ, నాన్‌మైనార్టీ వివరాలు, స్థానికత వివరాల్లో తప్పులుంటే ఈ నెల 8వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఈనెల 12నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884 235 9599, 234 2499 నెంబర్లలో కానీ, helpdeskapeapcet@apsche.org అనే మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ వీవీ సుబ్బారావు సూచించారు.

స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌తో

జేఎన్టీయూకే ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న యూనివర్శిటీ, కంపెనీ ప్రతినిధులు

జేఎన్టీయూకే, మే 6 (ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని వీసీ సమావేశ హాల్లో హైదరాబాద్‌లోని స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కాకినాడ జేఎన్టీయూకే మధ్య అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదిరినట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఐఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా వర్శిటీ విద్యార్థులకు అనుభవపూర్వక ప్రాజెక్టు ఆధారిత అభ్యసన మరింత సులభతరమవుతుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు, అధ్యాపకులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్స్, హ్యాకథాన్స్, ఎఫ్‌డీపీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉపాధ్యక్షురాలు ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృత విధానం, నూతన ఆవిష్కరణలు, విలువలతో కూడిన శిక్షణను తమ సంస్థ ద్వారా విద్యార్థులకు అందిస్తామన్నారు. వీసీ సమక్షంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్మార్ట్ బ్రిడ్జ్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ మురళీకృష్ణ, డైరెక్టర్లు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ప్రొఫెసర్ జి.పద్మజారాణి, ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, స్వర్ణకుమారి, చక్రవర్తి పాల్గొన్నారు.

11న బాస్కెట్‌బాల్ అండర్-23

జట్ల ఎంపికలు

పిఠాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పురుషులు, మహిళలు (అండర్-23) బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక, చాంపియన్‌షిప్ పోటీలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలలో ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు. క్రీడాకారులు 2002 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఒక పట్టణం నుంచి ఒక టీమ్‌ను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలను ఒరిజనల్ తీసుకురావాలని సూచించారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం



డీఈలు, ఏఈలతో మాట్లాడుతున్న ఎస్ఈ గోపీనాథ్

- ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్
- డీఈలు, ఏఈల నుంచి క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకున్న ఉన్నతాధికారి

ధవళేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అందరూ సంసిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ కోరారు. మంగళవారం ఉదయం తమ కార్యాలయంలో ఈఈలు, డీఈలు, ఏఈలతో వరద నివారణ సమాయత్త సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, ఏటిగట్ల పటిష్టత, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితి తదితర వివరాలు, వాటి నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో గోదావరి వరదల వల్ల బలహీనపడిన ఏటిగట్లు, వాటి పటిష్టతకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం ముందస్తుగా తీసుకోవాల్సిన పనుల వివరాలను అడిగారు. వరద నివారణ చర్యలు చేపట్టడానికి ఫ్లడ్ స్టోర్స్‌లో ఉన్న ఫ్లడ్ మెటీరియల్ వివరాలతో పాటు కావాల్సిన ఫ్లడ్ మెటీరియల్ వివరాలు అందజేయాలన్నారు. ఫ్లడ్ బ్యాంకులపై కాలువ గట్లపై చెత్తను డంప్ చేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు పంపించాలని ఆదేశించారు.అధికారులు క్షేత్రస్థాయిలో ఫ్లడ్ బ్యాంక్‌లను, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితిని పరిశీలించాలని ఇసుక ర్యాంపుల కోసం కొన్ని చోట్ల ఫ్లడ్ బ్యాంక్‌లను ఛిద్రం చేస్తున్నారని వాటిని గుర్తించి చర్యలు తీ సుకోవాలని సూచించారు. వరదలను ఎదుర్కోవడానికి ఫ్లడ్ డ్యూటీ అధికారులు అందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎస్ఈ జి.కనకేష్, తూర్పు డెల్టా ఈఈ వి.రామకృష్ణ, మధ్య డెల్టా ఈఈ బి.శ్రీనివాసరావు, డ్రైనేజీ డివిజన్ ఈఈ కిషోర్, వశిష్ట సబ్ డివిజన్ డీఈ జి.శ్రీనివాస్, హెడ్‌వర్క్స్ సబ్ డివిజన్ డీఈ ఆనందబాబు, గౌతమి సబ్ డివిజన్ డీఈ సుబ్బారావు, ఏఈలు విశ్వనాథరాజు, ఎ.సాయిరాం, సునీల్, రాధాకృష్ణ, ప్రసాద్, మణికంఠ, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

సన్నద్ధంగా ఉన్నాం

గోదావరి వరదలను ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నామని ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. 20లక్షల క్యూసెక్కులకు పైబడి వరద వచ్చినా తట్టుకునే విధంగా ఫ్లడ్ బ్యాంక్స్ పటిష్టంగా ఉన్నాయన్నారు. కాటన్ బ్యారేజ్ గేట్లకు మరమ్మతులు చేపట్టడానికి రూ.15 లక్షలతో అంచనాలు రూపొందించామని, అనుమతి లభించిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. కూళ్ల, సుందరపల్లి, కుండలేశ్వరం తదితర ప్రాంతాల్లో బలహీన ఫ్లడ్ బ్యాంక్‌లను తాత్కాలికంగా పటిష్టం చేస్తామని తాజా, ఈస్ట్ కొక్కిలేరు, కడలి తదితర ప్రాంతాల్లో కొత్త ఔట్‌ఫాల్స్ స్లూయిస్‌ల నిర్మాణానికి రూ.9.4 కోట్లతో రూపొందించిన అంచనాలకు ఆమోదం లభించిందని,వరదల అనంతరం పనులు చేపడతామని పేర్కొన్నారు. ఫ్లడ్ స్టోర్‌లలో అవసరమైన ఫ్లడ్ మెటీరియల్ కోసం టెండర్లు పిలుస్తామని తెలిపారు. కాల్వ గట్లు వెంబడి ఫ్లడ్ బ్యాంక్‌లపై చెత్తను వేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఎస్ఈ గోపీనాథ్ చెప్పారు.

పాపికొండల యాత్రకు గ్రీన్ సిగ్నల్

దేవీపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల విరామం అనంతరం పాపికొండల విహారయాత్ర పర్యాటక బోట్లకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆదివారం ఉదయం మండలంలో ఈదురుగాలులు భారీ వర్షం కురవడంతో పాపికొండలు వెళ్లే బోట్లను అధికారులు నిలిపివేశారు. దీంతో మూడు రోజులు పాటు విహార యాత్ర నిలిచిపోయింది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో బుధవారం నుంచి యాత్రకు వెళ్లేందుకు పర్యాటకుల బోట్లకు అధికారులు అనుమతులిచ్చారు. బుధవారం సుమారు 70 మంది పర్యాటకులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లను బుక్ చేసినట్టు తెలిసింది.

నాడు రాలే.. నేడు హాయిలే..

వసంతమాసం వచ్చిందంటే చెట్లు మోడుబారుతాయి. మళ్లీ కొత్తగా చిగురిస్తాయి. సామర్లకోట, యానాం రహదారుల్లో భారీ వృక్షాలు మోడుబారి రోజుల వ్యవధిలో పచ్చదనం సంతరించుకున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.




యానాం నుంచి నీలపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో మోడుబారి అటుపై పచ్చదనంతో నిండిన రావిచెట్టు




సామర్లకోట ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో భారీ చెట్టు దృశ్యాలు

మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత

గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృతి

కపిలేశ్వరపురం మండలం వీధివారిలంకలో సంఘటన

కపిలేశ్వరపురం/మండపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక శివారు వీధివారిలంకలో మంగళవారం స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం మండపేట మార్కెట్‌కు సెలవు కావడంతో పట్టణానికి చెందిన దాసరి సాయిరామ్ (27), మెండెం రాంబాబు(35), వనుం గోవిందు, బెజవాడ శ్రీనివాస్‌లు వీధివారిలంకలోని ధనమ్మ మర్రి వద్ద మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లారు. మొక్కు తీర్చుకుని భోజనాలు చేసిన అనంతరం చెంతనే ఉన్న గోదావరిలో దిగి స్నానానికి దిగి రాంబాబు, సాయిరామ్‌లు గోదావరిలో గల్లంతయ్యారు. దీంతో మండపేట రూరల్ సీఐ పెద్దిరాజు, అంగర ఎస్‌ఐ రవికుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయిరామ్, రాంబాబు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీఆర్వో వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ రవికుమార్ పేర్కొన్నారు.



రాంబాబు మృతదేహం, ఫైల్‌ఫొటో



సాయిరామ్ మృతదేహం, ఫైల్‌ఫొటో

మండపేటలో విషాదచాయలు

ఇద్దరు మృతితో మండపేటలో విషాదచాయలు అలుముకున్నాయి. పార్థసారధినగర్‌కు రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాంబాబు తండ్రి పొగాకు వ్యాపారం చేస్తుంటాడు. సాయిరామ్ ఆంధ్రా బ్యాంకు వీధిలోని ప్రైవేటు చార్టెడ్ అంకౌంటెంట్ వద్ద పనిచేస్తున్నాడు. అతడు అవివాహితుడు, తండ్రి కేపీరోడ్డులో బియ్యం వ్యాపారం చేస్తుంటాడు. మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాతపడడంతో ఇద్దరి కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదిస్తున్నారు.

కుమార్తెను బస్సు ఎక్కించడానికి వెళ్తూ..

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి



మృతిచెందిన బత్తిన వెంకటరమణ

ధవళేశ్వరం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ప్రధాన రహదారిపై జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ బత్తిన వెంకటరమణ(56) కుటుంబంతో కొంతమూరులో ఉంటూ రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తనకు కేటాయించిన విధులు నిర్వర్తించడానికి వేమగిరి పయనమయ్యాడు. తన కుమార్తెను బ్యారేజి సెంటర్ వద్ద బస్సు ఎక్కించడానికి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తూ ధవళేశ్వరం సినిమా థియేటర్ సెంటర్ సమీపంలోకి వస్తుండగా రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి వస్తూ సైడ్ నుంచి ఢీకొనడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి వెంకటరమణ బస్సు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్తెకు గాయాలు కాలేదు. ప్రమాద సమాచారం అందుకున్న ధవళేశ్వరం సీఐ గణేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణ కుటుంబ సభ్యులను ఎస్పీ నరసింహకిషోర్ పరామర్శించి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వెంకటరమణ భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తూర్పుగోదావరి ఎస్పీ

నేటి నుంచే సత్యదేవుని

దివ్యకల్యాణోత్సవాలు

- తొలిరోజు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరణ
- శరవేగంగా ఏర్పాట్లు
- పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ



సత్యదేవుని దివ్యకల్యాణం కోసం కొబ్బరి బొండాలతో అలంకరణ

అన్నవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తవరదాయుడు అన్నవరం సత్యదేవుడు వరుడవుతున్న వేళ రత్న,సత్యగిరులు పులకించిపోతున్నాయి. శ్రీవిశ్వావసు నామ సంవత్సర వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను పండితులు పెళ్లికొడుకు, పెళ్లికూతురుగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అనివేటి మండపం వద్ద ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం కల్యాణవేదికను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పరిశీలించారు. ప్రముఖులు, సామాన్యుల గ్యాలరీలను పరిశీలించి సూచనలు చేశారు. భక్తులు ఎక్కువగా వస్తుండడంతో ఎటువంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటన లు జరగకుండా ప్రత్యేక చర్యలు అదనపు సీసీ కెమెరాలతో నిఘా పెంచినట్టు డీఎస్పీ తెలిపారు. సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రముఖుల వాహనాలు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్‌లు మాత్రమే తూర్పురాజగోపురం పార్కింగ్ వద్ద నిలపనున్నారు. భారీవాహనాలను కొండదిగువన కళాశాల మైదానంలో



విద్యుత్ కాంతుల్లో ఆలయం

ఉంచి దేవస్థానం, ప్రయివేట్ బస్సుల్లో భక్తులను కొండపైకి తీసుకెళ్లనున్నట్టు ఈవో వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామ్మోహనరావు, ఏఈవోలు, ఇంజనీరింగ్ అధి కారులు పాల్గొన్నారు. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన ఒక భక్తుడు ప్రత్యేక అలంకరణతో తయారుచేయించిన కొబ్బరిబొండాలను స్వామివారి కల్యాణానికి వినియోగించాలని కోరారు. దివ్యకల్యాణం సందర్భంగా దేవస్థానం కొండపై, కొండదిగువన ఏర్పాటుచేసిన విద్యుద్దీపఅలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఐపీఎస్ అధికారుల పూజలు

సత్యదేవుని సన్నిధిలో మంగళవారం రాత్రి ఐపీఎస్ అధికారులు డైరక్టర్ జనరల్ అంజనీకుమార్, జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం ప్రత్యేకపూజలు జరిగాయి.

వక్ఫ్‌చట్ట సవరణను నిరసిస్తూ

ముస్లింల భారీ ర్యాలీ



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

రాజమహేంద్రవరం సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తూర్పుగోదావరి జిల్లారాజమహేంద్రవరంలో ముస్లింలు భారీ ర్యాలీ చేశారు. రాజమండ్రి ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాంపేట మసీదు -ఆజాద్ చౌక్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన భారీ ర్యాలీలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు ముమ్మాటికి రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. భారతదేశంలో సుమారు 22కోట్ల మంది ముస్లింల అస్తిత్వాన్ని అస్థిరపరిచేవిధంగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వక్ఫ్‌చట్టాన్ని కేంద్రం ఆమోదించడం దారుణమన్నారు. ముస్లిం ఆస్తులను కాజేసే కుట్రలో భాగంగానే ఈ చట్టసవరణ చేశారని, ఇది భారత రాజ్యాంగానికి చీకటి రోజు అని అన్నారు. ముస్లింల ఆస్తులను ప్రభుత్వాలు తమ ఆధీనంలోకి తీసుకుని వారిని అణచివేయాలనుకోవడం ముస్లిం సమాజాన్ని భయపెట్టడమేనన్నారు. ర్యాలీలో హబీబుల్లాఖాన్, అహ్మద్ అన్సర్, కలిముల్లాఖాన్, అస్సర్, ముక్తియార్, బ్యూటీ షరీఫ్, డిల్లు, అసదుల్లా అహ్మద్, సల్మాన్,బాబులు రబ్బాని పాల్గొన్నారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి



పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న యూనిట్లు

ఏప్రిల్ 1 నుంచి మే 5 వరకు విద్యుదుత్పత్తి వివరాలు

ప్రాజెక్టు	సామర్థ్యం మెగావాట్లు	ఉత్పత్తి మిలియన్ యూనిట్లు
మాచ్‌ఖండ్	120	45.12
సీలేరు	240	57.85
డొంకరాయి	25	14.97
పొల్లూరు	460	121.98

మోతుగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో నిర్విరామంగా విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఒక్క మాచ్‌ఖండ్ మినహా అన్ని కేంద్రాల్లో యూనిట్లు అందుబాటులో ఉండటంతో ఉత్పత్తి నిరంతరంగా జరుగుతోంది. ఉన్న నీటి నిల్వలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు జల విద్యుత్తు కేంద్రాల్లో మాచ్‌ఖండ్ మినహా అన్ని లక్ష్యాన్ని పూర్తి చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మాచ్‌ఖండ్‌తో సహా అన్ని చోట్ల లక్ష్యసాధన దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది మాచ్‌ఖండ్‌లో నాలుగో యూనిట్ షాఫ్ట్‌షీట్ నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. గత నెలలో అరకు లైన్‌ట్రిప్ అవుతుండడంతో మొదటి యూనిట్ నుంచి ఉత్పత్తి ఆపేశారు. ఈ 2 యూనిట్లను వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. సీలేరు, పొల్లూరు, డొంకరాయి, మాచ్‌ఖండ్‌లో ప్రస్తుతం రోజుకు 4 నుంచి 5 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి జరుగుతోంది.

శాస్త్రీయ సలహా సంఘం సమావేశం

రాజమహేంద్రవరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల వారి శాస్త్రీయ సలహా సంఘం సమావేశం మంగళవారం జరిగింది. జాతీయ వాణిజ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రాంతీయ వరి పరిశోధన సంస్థ మార్టేరు అసోసియేట్ డైరెక్టర్ టి.శ్రీనివాస్, పి.ముత్తురామన్, హైదరాబాద్ భారత వరి ప్రధాన శాస్త్రవేత్త ఐసీఏఆర్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకే కలవచర్ల హెడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణులు 2024-25లో చేపట్టిన కార్యక్రమాలు, 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. శేషమాధవ్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టు జిల్లాలోని కేవీకే పరిధిలోని మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన రంగాల సమాచారాన్ని బెంచ్ మార్కు సర్వేగా పరిగణించుకుని సహజ వనరుల ఉప లబ్ధి తదితర అంశాలపై మ్యాపింగ్ చేసుకుని అత్యంత అవశ్యకత అంశాలను గుర్తించి డాక్యుమెంట్ చేయాలని సూచించారు. నాయుడు మాట్లాడుతూ కేవీకే గతేడాదిలో చేపట్టిన వ్యవసాయ విభాగం కార్యక్రమాలను వివరించారు. ఉద్యానవన విభాగం జీవిఆర్ సత్యవేణి ఉద్యానవన విభాగం చేపట్టిన ప్రదర్శన, క్షేత్రస్థాయి పరిశీలన వివరించారు. సస్యరక్షణ విభాగం కార్యక్రమాలను ర ఘునందన్ చెప్పారు. పశు నిర్వహణను డాక్టర్ బి.నాగేశ్వర్‌రెడ్డి, మత్స్యశాఖను డాక్టర్ రవీంద్ర, హెగ్డే గృహ విజ్ఞాన కార్యక్రమాలను సంజయ్ వివరించారు. రైతుల ప్రయోజనార్థం లిల్లీతోటల్లో నులిపురుగు నివారణ సమగ్ర యాజమాన్యం, పసుపులో దుంప కుళ్లు సమగ్ర యాజమాన్యం అనే రెండు కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ఏరువాక, రాజమండ్రి, కాకినాడ శాస్త్రవేత్తలు ఎంటీవీ చలపతిరావు, పి.లలితాకామేశ్వరి, డీవీఎస్ రాజు, శిరీష తదితరులు పాల్గొన్నారు



కరపత్రాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్, శాస్త్రవేత్తలు

కారు కింద పడి ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయాలపాలైన ఓ వ్యక్తి

నల్లజర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నపురానికి చెందిన భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి బైక్‌పై కన్నపురం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తుండగా ప్రకాశరావుపాలెం శివారులో కారును అధిగమించే ప్రయత్నంలో అదే కారు కింద పడి తీవ్ర గాయాలయ్యారు. 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఏ కేసు నమోదు కాలేదని ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఇంటిపై పిడుగుపడి మహిళకు గాయాలు

తాళ్లపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో ఇటీవల కురిసిన వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని బొర్రా వీరలక్ష్మి ఇంటిపై పిడుగుపడి ఇల్లు పాక్షికంగా వెబ్బతినడమేకాక ఆమె గాయాల పాలైంది. దీంతో రాజమహేంద్రవరంలోని ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. అన్నదేవరపేట వీఆర్వో కావూరి నాగేశ్వరరావు నివేదిక ప్రకారం ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. వైద్యం నిమిత్తం రూ.8000 అందించినట్టు తెలిపారు.

రైలు ఢీ కొని మహిళ మృతి

తుని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని మహిళ మృతిచెందిన సంఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నర్సీపట్నం 1 రైల్వే స్టేషన్ ప్లాట్‌పారంలో పట్టాలు దాటుతుండగా సాలూరు సంతోషి (35) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న తుని రైల్వే పోలీసులు మృతురాలి వివరాలు సేకరించారు. విజయనగరం జిల్లా తోట వలస గ్రామానికి చెందిన మహిళగా గుర్తించినట్టు తెలిపారు. శవ పంచనామాలు అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

ఒంగోలు ఆవు రికార్డు

ఒక్కరోజులో 21.19 లీటర్ల పాలు

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పాడి రైతు వేగుళ్ల మురళీకృష్ణకు చెందిన ఒంగోలు జాతి ఆవు పాలు ఇవ్వడంతో రికార్డు నెలకొల్పింది. సాధారణంగా ఒంగోలు జాతి ఆవు పూటకు రెండున్నలీటర్ల నుంచి మూడు లీటర్లు ఇస్తుంది. రోజుకు 5లేదా 6లీటర్లు ఇవ్వటం పరిపాటి. అలాంటిది మురళీకృష్ణకు చెందిన 5ఏళ్ల ఆవు మంగళవారం ఉదయం 11.5 లీటర్లు, సాయంత్రం 9.6 లీటర్లు కలిపి ఒక్కరోజులో 21.19 లీటర్ల పాలు ఇచ్చి సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. కేంద్రియ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు సమక్షంలో మురళీకృష్ణ పాలు తీయగా పాలు వివరాలను నమోదు చేసి కేంద్రియ పశు నమోదు సెంటర్‌కు పంపించారు.



రికార్డు స్థాయిలో పాలు ఇచ్చిన ఆవు

ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకి చెందిన మద్దల లక్ష్మీసాయి రామజ్యోతి తన అత్తకు అనారోగ్యం కారణంగా ఈ నెల 5న రూ.1,70,000 నగదును బ్యాగ్‌లో సర్దుకుని సింగవరం నుంచి నిడదవోలు ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో అత్తకు చికిత్స చేయించి ఆటోలో సింగవరం పంపించిన అనంతరం బస్టాప్‌కి వచ్చి 20 నిమిషాలు వేచి ఉంది. అనంతరం తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎక్కి కొవ్వూరు టోలిగేట్ వద్ద దిగింది. అక్కడి నుంచి తన తండ్రికి ఫోన్ చేయగా బండిపై టోల్ ప్లాజా వద్దకు ఆయన వచ్చాడు. తండ్రితో పాటు లక్ష్మీసాయి రామజ్యోతి దొమ్మేరులోని తల్లి ంటికి వెళ్లింది. అక్కడ బ్యాగును తెరిచి చూడగా నగదు కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ ప్రకాష్ తెలిపారు.

చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుకు చర్యలు

ఉప్పాడ చేనేత కార్మికులతో ఆర్‌జీఎస్‌ఏ కోఆర్డినేటర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వినోద్

కొత్తపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి, తద్వారా చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపరిచేం దుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విజయవాడ నుంచి ఆర్‌జీఎస్‌ఏ (రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్య అభియాన్) కో ఆర్డినేటర్ వినోద్ మంగళవారం కాకినాడ జిల్లా ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో సమా వేశమయ్యారు. రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్య అభియాన్‌లో ఉప్పాడ గ్రామం ఎంపికైందన్నారు. దేశ, విదేశాల్లో ఉప్పాడ చేనేత జాం ధానీ చీరలకు మంచిగుర్తింపు ఉందని అటువంటి ఖరీదైన చీరలు తయారు చేసేందుకు అవసరమైన వసతులు, తద్వారా కార్మికుల జీవనప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం రూ.5కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించినట్టు చెప్పారు. దానిలో భాగంగా చేనేత కార్మికులకు ఏ వసతులు కల్పించాలి, జాంధానీ చీరల తయారీకి సమకూర్చాల్సిన ముడిసరుకు తదితర విషయాలపై చర్చించారు. చేనేత చీరల తయారీకి అవసరమైన ముడిసరుకులను రాయితీపై అందచేయాలని చేనేత కార్మికుడు దైవం మహేష్ కోరాడు. చీరల తయారీకి పడుగు, హల్లులు చేసేందుకు విశాలమైన ప్రదేశం అవసరం ఉంటుందన్నారు. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీ జాన్, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వందేళ్ల వృక్షం.. బతికించుకుందాం!



రాజమహేంద్రవరంతో పాటు చుట్టు పక్కల భారీ వృక్షాలు కనుమరుగయ్యాయి. అభివృద్ధి పేరుతో రహదారులు విస్తరణలో వందలాది వృక్షాలను నరికేశారు. దీంతో నగర పరిసరాలు ఎండవేడిమికి మండిపోయి చల్లదనం కరువైంది. కొత్తగా మొక్కలు నాటి వాటిని వృక్షాలు చేయడానికి సమయంపడుతుంది. కానీ ఉన్నవాటిని నిలబెట్టుకుంటే నెలల వ్యవధిలో అవి పునర్జీవం పొంది చల్లటి నీడను బాటసారులకు ఇస్తాయి. ఇలాంటి చెట్లే రాజమహేంద్రవరంలో అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. లాలాచెరువు సెంటర్‌లో బస్టాండ్ వెనకాల ఒక భారీ వృక్షం నెలకొరిగింది. దీని వయస్సు సుమారు 100 ఏళ్లు. దానంత వయస్సు వరకు మనుషులు బతకకపోయిన అటువంటి వాటిని బతికించుకుంటే మరిన్ని వందల ఏళ్లు బతికి భవిష్యత్ తరాలకు ఆక్సిజన్‌ను అందిస్తుంది. సినిమా చెట్టును బతికించిన సంస్థలు రాజమహేంద్రవరంలో ఇలాంటి వృక్షాలపైన కూడా దృష్టిపెడితే బాగుంటుంది.

ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

9న జాబ్ మేళా

కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల్లో పని చేయడానికి ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 86398 46568 నెంబరును సంప్రదించాలని కోరారు.


రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామిని తిరువీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రారంభమైన భావనారాయణ స్వామి

వార్షిక దివ్య కల్యాణోత్సవాలు

సర్పవరం జంక్షన్, మే 6 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రం సర్పవరం శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈవో, సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మూలమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాజ్యలక్ష్మిని పెండ్లి కుమార్తెగా, భావనారాయణ స్వామిని పెండ్లి కుమారుడిగా చేసి చిన శేష వాహనంపై తిరువీధి ఉత్సవం జరిపారు. వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 14వ తేదీ వరకు జరుగుతాయని ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు భావనారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ పుల్ల శ్రీరాములు, మాజీ ఛైర్మన్ పుల్ల శ్రీను, గ్రామ పెద్దలు పాలొన్నారు.


దోమాడ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'మూడు సెంట్ల స్థలం, హౌసింగ్ లోన్ ఇప్పిస్తాం'

కాకినాడ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): రెండు వారాలుగా ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను కలవనీయకుండా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తమను తప్పుదోవ పట్టించారని దోమాడలో ఇళ్లు కోల్పోయిన బాధితులు మంగళవారం పెదపూడి మండలానికి విచ్చేసిన అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. ఉద్యమ సంఘాల నాయకులు బాధితుల పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే దోమాడ వెళ్లి శిబిరంలో నిరసన తెలుపుతున్న మిగిలిన బాధితులను కలిసి మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన సెంటున్నర స్థలానికి బదులుగా బాధితులకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి పట్టాలు మంజూరు చేస్తామని, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3లక్షల వరకు హౌసింగ్ లోన్ ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పెదపూడి తహసీల్దారు సీతాపతి, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ పండితుడు మురళీకృష్ణ

'సంధ్యావందనంతో సమస్త లోకానికీ మేలు'

కాకినాడ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు తెచ్చేది వేద పండితులు, పురోహితులు, అర్చకులేనని ప్రముఖ పండితుడు ఆకెళ్ల మురళీకృష్ణ పేర్కొన్నారు. హిందూ జనసంఘ్ ఆధ్వర్యంలో 'ప్రతి హిందువు... మన బంధువే...' నినాదంతో మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంధ్యావందనం చేయడం వల్ల సమస్త లోకానికీ మేలు కలుగుతుందన్నారు. పెద్దలందరినీ కలుపుకుని సమాజంలో మార్పు తెచ్చేం దుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పీఠాధిపతులు, హిందూ పెద్దలు చెప్పిన మంచి విషయాలను పాటించాలని కోరారు. సమావేశంలో పట్టణ పురోహిత సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీ బాలాత్రిపురసుందరి ఆలయ అర్చకుడు సన్నిధిరాజు విజయ్‌కుమార్, చల్లా నిరంజన్ మాట్లాడగా కె.భీమశంకరం, సర్వేశ్వరరావు, దిశ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జన సైనికుడిని సత్కరిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు

జన సైనికుల ఆత్మీయ సమావేశం

పెద్దాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజుగారి వీధిలో ఉన్న ఎస్వీ కాంప్లెక్స్‌లో జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) మంగళవారం ఆ పార్టీ క్రియాశీలక వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ భరోసా ఇచ్చేలా క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయిస్తామన్నారు. అధిక సభ్యత్వాలు నమోదు చేసిన నాయకులను సన్మానించారు. సమావేశంలో జనసేన పట్టణ శాఖ అధ్యక్షుడు పోలమరశెట్టి సత్తిబాబు, శ్రీను, తమనార లక్ష్మణదివాకర్, కొప్పిరెడ్డి నాగబాబు, కౌన్సిలర్ ఒబిలిశెట్టి గున్ని, వంగలపూడి సతీష్, మలిరెడ్డి బుచ్చిరాజు, పబ్బినీడి ఈశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయ ఆధునికీకరణ పనుల పరిశీలన

సామర్లకోట, మే 6 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట తహసీల్దారు కార్యాలయాన్ని రూ.20 లక్షలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. దీనిని ఈ నెల 13న మంత్రులతో ప్రారంభింపజేసేందుకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆయన టీడీపీ పట్టణ, మండల నాయకులతో కలిసి భవనాన్ని సందర్శించి తగు సూచనలు చేశారు. కమిషనరు శ్రీవిద్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రజలను 'చేరువ' చేసుకోవడంతో సత్ఫలితాలు

ఎస్పీ బిందు మాధవ్

కాకినాడ క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై వారిని చేరువ చేసుకోవడంతో సత్ఫలితాలు సాధించవచ్చని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. ప్రజలతో పోలీసులకు సంబంధాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో పోలీసుల పని తీరును తెలుసుకోవడం కోసం 'చేరువ' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వ్యాపార, వర్తక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలు, ఫేక్ కాల్స్, యూట్యూబ్ బెదిరింపులు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలు, నకిలీ వ్యాపారాలపై ఎదుర్కొంటున్న ఇబ్బందులను వ్యాపారులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిందుమాధవ్

షాపులు, హోటల్స్, మాల్స్ పని సమయాలు, సండే మార్కెట్ వంటి అంశాలపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో భాగంగా ఎగుమతి, దిగుమతి సమయాలను ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసేలా సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 24 నూతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. షాపులు, మాల్స్, అపార్ట్‌మెంట్లు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను రోడ్డును కవర్ చేసేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ దొంగతనాలకు చాట్‌బాట్ నెంబరు 9490617852కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అనే పదానికి మోసపోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 (నేషనల్ సైబర్ క్రైం హెల్ప్ లైన్)కు కాల్ చేయాలన్నారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ, గ్రంధి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించండి

కమిషనరును కలిసిన కాకినాడ జిల్లా పట్టు రైతులు

గొల్లప్రోలు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా బకాయి ఉన్న ఇన్సెంటివ్ బకాయిలు రూ.3 కోట్లు తక్షణం చెల్లించాలని, పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాకినాడ జిల్లా పట్టు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు గుంటూరులోని పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయానికి వెళ్లి కమిషనరును, ఇతర అధికారులను కలిశారు. పట్టు పురుగుల రేరింగ్ షెడ్లను శుభ్రపరచడానికి ఇచ్చే బ్లీచింగ్ రాయితీ సొమ్ములు నాలుగేళ్లుగా ఇవ్వట్లేదని, మల్బరీ మొక్కలు నాటినప్పుడు ప్లాంటేషన్ రూపంలో రాయితీలను కేంద్రం తప్ప రాష్ట్రం ఇవ్వట్లేదన్నారు. 100 పట్టుగుడ్లకు ఇచ్చే రాయితీ రూ.150 ఇవ్వట్లేదని, రీలర్లు, దళారుల నుంచి రావాల్సిన రూ.34లక్షలను రైతులకు ఇప్పించాలని, మార్కెట్ షెడ్లను పూర్తి చేయాలని కోరారు. యాంత్రీకరణ వస్తువులను సబ్సిడీపై అందజేయాలన్నారు. గుంటూరు వెళ్లిన వారిలో గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పట్టు రైతులు ఓరుగంటి చినగంగాధరరావు, రాంబాబు, ఏసుబాబు, శ్రీను, చల్లా రామకృష్ణ, పి.ఈశ్వరుడు, ఒ.చక్రధరుడు, రాజు, పుప్పాల శివ వున్నారు.


గుంటూరులోని పట్టు పరిశ్రమ శాఖ కమిషనరు కార్యాలయం వద్ద చేబ్రోలు పట్టు రైతులు

20న దేశవ్యాప్త సమ్మెకు ట్రాన్స్‌పోర్ట్ రంగం సిద్ధం

కాకినాడ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం సీఐటీయూ, ట్రాన్స్‌పోర్ట్ సంఘాల ఆధ్వ ర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన సీఐటీయూ సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ట్రాన్స్‌పోర్ట్ రంగం సిద్ధమవుతోందన్నారు. తాజాగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్, సంప్రదింపుల హక్కు, ఉద్యమించే హక్కు కాలరాస్తున్నారన్నారు. సమ్మెలో ట్రాన్స్‌పోర్ట్‌రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వివిధ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ల నాయకులు నురుకుర్తి ప్రకాశరావు, ఎలిపే శ్రీనివాస్, వాలిశెట్టి శ్రీనివాస్, టి.రాము మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం పలుమార్లు చలానాలు తీయాల్సి వస్తోందన్నారు. సమ్మె అనంతరం దశలవారీగా ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. సీఐటీయూ నాయకులు కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ సీనియర్ నేత శేషుబాబ్జీ


వేసవి శిక్షణ శిబిరంలో కథలను చదువుతున్న విద్యార్థి

గ్రంథాలయంలో కథల పఠనం

కాకినాడ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో కథల పఠనం చేయించారు. పోరు నష్టం, హితోపదేశ కథల పుస్తకాలను చదివించి తర్వాత ఆ కథలపై విశ్లేషణ జరిపారు. డ్రాయింగ్ టీచర్ టి.జయరాం చిత్రలేఖనంలో శిక్షణ ఇప్పించారు. గ్రంథాలయ అధికారి ములంపాక శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'సీజన్‌లోగా పనులు పూర్తి చేయాలి'

గొల్లప్రోలు, మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజను ప్రారంభమయ్యేలోగా పుంత రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని జనసేన నాయకుడు కదారి తమ్మయ్యనాయుడు సూచించారు. పిఠాపురంలోని పాడా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణిని ఆయనతో పాటు గొల్లప్రోలు, సీతానగరం తదితర ప్రాంతాల రైతులు మంగళవారం కలిశారు. గొల్లప్రోలు, సీతానగరం ప్రాంతాల్లో రైతులు తమ పంటలను ఇంటికి తీసుకువచ్చేందుకు వీలుగా పుంత (మెటల్) రోడ్డు నిర్మాణం చేపట్టాలని, గండేవారి కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలను ఈ వ్యవసాయ సీజన్లోనే పరిష్కరిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఏపీడీ వసంతమాధవి, నాయకులు మొగలి రామ్మూర్తి, పర్ల శేషు పాల్గొన్నారు.


పంటపొలాల్లో పుంతరోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను పాడా పీడీకి వివరిస్తున్న జనసేన నేత తమ్మయ్యనాయుడు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఉప్పాడ, కొమరగిరి గ్రామాలకు చెందిన కొప్పిశెట్టి సూర్యచంద్రప్రకాశరావుకు రూ.2.29 లక్షలు, కొమ్మూరి వీరవాణికి రూ.45వేలు, తాడి మంగకు రూ.25వేలు, శివకోటి శాంతికుమారికి రూ.73వేలు మంజూరయ్యాయి. మంగళవారం వాటిని లబ్ధిదారులకు చెక్కుల రూపంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అందజేశారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

'పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం'

పెద్దాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరు, కాండ్రకోట, సిరివాడ, గుడివాడ గ్రామాల్లో మంగళవారం ఆయన సభ్యత్వ ఇన్చార్జి డాక్టర్ గొరపూడి చిన్నయ్యదొరతో కలిసి పర్యటించారు. నష్టపోయిన పంటను మిల్లర్లు త్వరితగతిన కొనుగోలు చేసేలా అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

త్రివిధ దళాలకు విజయం చేకూరాలని అపర్ణాదేవికి పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న మన త్రివిధ దళాలకు విజయం చేకూరాలని, ఎటువంటి ప్రాణహాని జరగకూడదని ప్రార్థిస్తూ తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి అర్జునకృత శ్రీదుర్గాస్తోత్రంతో కుంకుమ పూజ చేశారు. దుర్గాస్తోత్రాన్ని తొమ్మిదిసార్లు పఠించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్

'సాధికార సారథులను త్వరితగతిన నియమించాలి'

పిఠాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికారిక సారథుల నియామక ప్రక్రియను గురువారంలోగా పూర్తి చేయాలని టీడీపీ పిఠాపురం నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్ సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన పిఠాపురం పట్టణ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అన్ని వివరాలతో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. భవిష్యత్తులో పార్టీ తరపున నిర్వహించే కార్యక్రమాల్లో కుటుంబ సాధికార సారథులు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు.

పిఠాపురంలో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

పిఠాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్, సిబ్బంది మంగళవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఉప్పాడ సెంటరు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా కోట గుమ్మం సెంటరు, మునిసిపల్ మార్కెట్ వరకు కాలినడకన పర్యటించి రోడ్డుపైకి వచ్చిన షాపుల ఆక్రమణలను తొలగింపజేశారు. మరలా ముందుకు వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని షాపుల నిర్వాహకులను హెచ్చరించారు.



మరిడమ్మ అమ్మవారికి మఖ నక్షత్ర పూజలు



పెద్దాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి మూలవిరాట్టుకు మఖ నక్షత్రం సందర్భంగా వేదపండితులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుగంధభరిత పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో సాగుతున్న రథయాత్ర

ఇస్కాన్ రథయాత్ర

పిఠాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో ఇస్కాన్ రథయాత్ర సాగింది. కాశీ నుంచి కన్యాకుమారి వరకు... అక్కడి నుంచి ద్వారక వరకు ఇతర పుణ్యక్షేత్రాలను కలుపుతూ ఏడో విడతగా ఈ రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఎడ్లు రథాన్ని లాగుతుండగా ఇస్కాన్ ప్రతినిధులు ధర్మ ప్రచారం సాగించారు. మంగళవారం పిఠాపురం పట్టణ వీధుల్లో భగవద్గీత, రామాయణం, భారతం ప్రాముఖ్యతను వివరిస్తూ పుస్తకాలు విక్రయించారు. రథాన్ని లాగుతున్న ఎడ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

'వేతన బకాయిలు ఇప్పించాలి'

జీజీహెచ్ (కాకినాడ) మే 6 (ఆంధ్రజ్యోతి): బకాయి ఉన్న రెండు నెలల వేతనాలు ఇప్పించాలని కాకినాడ జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌ను కలిసి వినతిపత్రం అందజేసారు. సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయకుమార్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో 20వ తేదీ దాటిన తర్వాతే జీతాలు చెల్లించడం పరిపాటిగా మారిందన్నారు. గత ఏడాది మేలో కాంట్రాక్ట్ గడువు ముగిసినా జీతాలు పెంచకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు శేషు, లక్ష్మీప్రియ, రాయుడు రమేష్, వాసు, శ్రీకాంత్, కృష్ణవేణి, రమణమ్మ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


యూపీహెచ్‌సీ సిబ్బందితో డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

రామారావుపేట యూపీహెచ్‌సీకి

ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్

జీజీహెచ్ (కాకినాడ), మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామారావుపేట యూపీహెచ్‌సీ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సర్టిఫికెట్ సాధించింది. గత నెల ఒకటో తేదీన జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్ జరిపిన తనిఖీలో ఈ యూపీహెచ్‌సీ 93.21 శాతం ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలిచిందని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందిని అభినందించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మి, డీపీఎంవో డాక్టర్ జ్యోత్స్న, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ తప్పనిసరి : ఎంఈవో

తొండంగి, మే6(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు. ప్రతి పాఠశాలలో గతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు చేరే విధంగా హెచ్ఎంలు, టీచర్లు, సీఆర్పీలు ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలని ధర్నా



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ఎటపాక, మే 6(ఆంధ్రజ్యోతి): అలుగువాగు ప్రాజెక్టులో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంద ఆధ్వర్యంలో మంగళ వారం తహసీల్దార్ కార్యాయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ డివిజన్ నాయకులు సాయన్న మాట్లాడారు. అలుగువాగు ప్రాజెక్టులో భూ ములిచ్చి రెండు దశాబ్ధాలు గడుస్తున్నా నేటికీ గిరిజనులకు పరిహారం చెల్లించలేదన్నారు. లక్ష్మీపురం పంచాయతీ లోని పూసుగూడెం, కృష్ణవరం పంచాయతీ లోని అచ్యుతాపురం గ్రామంలో మరమ్మతు లకు గురైన చేతిపంపులను బాగు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాలను తహసీల్ధార్ కా రం సుబ్బారావు, ఎంపీడీవో కార్యాలయంలో అంద జేశారు. ఈకార్యక్రమంలో చుక్కయ్య, ఉదయ్, కారం వీరమయ్య, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురంలో 1481 పీడీఎఫ్‌లు అర్హులు

ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలో పీవో



సభలో మాట్లాడుతున్న పీఓ అపూర్వభరత్

వీఆర్‌పురం, మే 6 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన వీఆర్‌పురంలో మంగళవారం ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈగ్రామసభలో అర్హులు అనర్హుల జాబితాను ప్రజాప్రతినిధులు, అధికారులు, నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ మండల కేంద్రమైన వీఆర్‌పురంలో మొత్తం 1704 పీడీఎఫ్‌లు గుర్తించగా, వాటిలో 1481 పీడీఎఫ్‌లు అర్హులుగా, 223 అనర్హులుగా గుర్తించారన్నారు. అనంతరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, బి.అభిషేక్ (ధవ శేశ్వరం) మాట్లాడుతూ నిర్వాసితులకు ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ గురించి పూర్తిగా వివరించారు. అనర్హులు ఎవరు నిరాశప డొద్దన్నారు. గ్రామసభలో పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మండలస్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, నిర్వాసితులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ

చింతూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల ఆర్ అండ్‌ఆర్ గ్రామసభ నేడు (బుధవారం) చింతూరు లో జరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ప్రకటించారు. 41.5 కాంటూరు స్థాయిలో ముంపునకు గురికానున్న గ్రామాలను గుర్తించిన ప్రభుత్వం ఆయా గ్రామాలలో వరుసగా గ్రామ సభలు నిర్వహిస్తోంది. చింతూరులో గ్రామ సభ ఏర్పాటుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. నిర్వాసితుల వివరాలను ఇప్పటికే ప్రకటించారు. కాగా ప్రకటనలో పలువురి పేర్లు నమోదు కాలేదన్న వాదన ఉంది. ఈ మేరకు ఆయా నిర్వాసితులు గ్రామసభలో తమ అభ్యంతరా లను లిఖిత పూర్వకంగా తెలియజేసే అవకాశం కల్పించారు. ఇదిలా వుండగా ఇంటి విలువల లెక్కింపుల్లో కూడా తప్పులు దొర్లాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధిత నిర్వాసితులు ఇప్పటికే తమ అభ్యంతరాలను పోలవరం స్పెషల్ డిప్యూటీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలిపారు.

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోవాలి

కూనవారం, మే 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని గురి తప్ప కూడదని కూనవారం అటవీ అధికారి కరుణాకరన్ అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన కూనవరం పాఠశాల విద్యార్థి ఏసుపాక వరుణ్ స్థానిక ప్రెస్‌క్లబ్ వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తనం నుంచే విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకోవాలన్నారు. ఎనిమిదో తరగతి వచ్చాక ఆ లక్ష్యం బలపడాలన్నారు. దానివైపుగా అడుగులు వైస్తూ ఆ లక్ష్యాన్ని సాధించాలన్నారు. మారుమూల ప్రాంతాలైన ఏజెన్సీలో ఇటువంటి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం వారి ప్రతిభకు అద్దంపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మయ్య, డీఆర్‌వో అనిల్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట్, జికృష్ణ ఎం.వినయ్, నవీన్, లోకేష్, ఇంతియాజ్, నాగు, వెంకన్న, విద్యార్థి తల్లిదండ్రులు రవికుమార్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అధికారి సూచనలు



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు

మోతుగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తులసిపాకలో ఏఎస్ఆర్ జిల్లా ఆశలకు సమావేశం నిర్వహించారు. మెడికల్ అధికారి డాక్టర్ ఎస్.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య సంరక్షణ, విద్య ఈ ఆశ యాప్, ఆశ సర్వీస్ రికార్డ్స్, మ్యా డ్యూల్‌పై ఓరియంటేషన్, ప్రెగ్నెన్సీ కిట్స్ ఆశ యాప్, సర్వీస్ అప్‌డేట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆశలకు మెడికల్ ఆఫీసర్ యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశలు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేత రంపచోడవరం జట్టు

రాజవొమ్మంగి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో జడ్డంగి గ్రామంలో మంగళవారం జరిగిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతగా రంపచోడవరం దినేస్ లెవన్ జట్టు విజయం సాధించింది. 40 రోజులుగా జడ్డంగి గ్రామంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో 53 జట్లు పోటీ పడ్డాయి. ఫైనల్ పోటీలో జడ్డంగిస్టార్ లెవన్ టీమ్, దినేష్ లెవన్ టీమ్‌లు తలపడగా రంపచోడవరం జట్టు విజయం సాధించారు. విన్నర్ జట్టుకు షీల్డ్, రూ.40వేలు చెక్, రన్నర్ జడ్డంగి జట్టుకు రూ.20వేలు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాలమ్మ తల్లి జాతర

రాజవొమ్మంగి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒట్టిగడ్డ గ్రామంలో 9వరోజు పట్టాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే దంపతులు మిరియాల శిరీషదేవి, విజయభాస్కర్ దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవి బోనాలు ఎత్తుకున్నారు. అమ్మవారి జాతరలో శక్తి వేషాలు, కోలాటం, గరగలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంతులూరి శివ రామచంద్రరాజు, గొల్లపూడి పెద్దిరాజు, మొప్పన కేశ, తాతారావు పాల్గొన్నారు.



బోనాలు ఎత్తుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

వీఆర్‌పురం, మే 6 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. జడ్పీటీసీ సభ్యులు వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ మండలంలో అక్కడక్కడ మంచినీటి ఎద్దడి ఉందని ఆయా గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచులు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం సర్పంచ్ పులి సంతోష్ మాట్లాడుతూ వీఆర్‌పురం బీసీ కాలనీ నుంచి ఎంపీడబీవో కార్యాలయం వరకు అసంపూర్తిగా వదిలేసినా సంబంధిత శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఆసుపత్రిలో ఇదేమి భోజనం?

● నాణ్యత లోపించడంపై విమర్శలు




రోగులకు వడ్డించే నాణ్యతలేని భోజనం

తుని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లకు అంద జేసే భోజనంలో నాణ్యత లోపించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ఏటా తుని ఏరియా ఆసుపత్రికే రూ.50 లక్షలకు పైబడి నిధులు ఖర్చు చేస్తుంది. రోజుకి సుమారుగా 200 పైబడి రోగులకు పౌష్టికాహారాన్ని వండించేందుకు తుని ఏరియా ఆసుపత్రి కాం ట్రాక్టర్‌పై విమర్శలు వెల్లువెత్తు న్నాయి. సకాలంలో భోజనాలు వడ్డించకపోగా, అరాకొర భోజనంతో సరిపెడుతూ పేషెండ్ల కడుపు కట్టుకునేలా చేస్తున్నారని పలువురు రోగులు కుటుంబీకులు వాపోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం రోగులు పాలిట శాపంగా మారింది.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతీ మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో ఈవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, కురుమల్ల నాగేశ్వరరావు, గంధం శ్రీను, జీవీ నాయుడు, డ్రిల్ మాస్టారు , రేపూరి శ్రీను, గుంటముక్కల చిన్న పాల్గొన్నారు.

60 లీటర్ల సారా పట్టివేత

రౌతులపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామశివారు మరిడమ్మతల్లి చెట్టు వద్ద తరలిస్తున్న 60 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన చింత శ్రీను నుంచి సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తుని జేఎఫ్‌సిఎమ్ కోర్టు నందు హాజరుపరుస్తామని ఎస్ఐ చెప్పారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

జగ్గంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, రామవరం, కాట్రావులపల్లిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయాధికారి శ్రీరామ్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో మండలపరిధిలో 150 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని బుధ,గురువారాల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు చేసే చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



యర్రవరంలో పూజలు చేస్తున్న పురోహితులు

ఏలేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 8న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం వేద పండితులు నేతృత్వంలో బస్నాప్రసాద్ దంపతులతో గణపతి పూజ, కలశపూజ నిర్వహించారు. బుధవారం సంకల్పం, రక్షాబంధన్, ప్రవేశ హోమం, నవగ్రహ ఆరాధన పూజ, గురువారం సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు అందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకోవాని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

టీడీపీ బలోపేతానికి కృషి : యనమల



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి రామకృష్ణుడు

తుని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో తొండంగి మండలానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి యనమల సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి యనమల పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ధోని సత్తిబాబు, ధోనీ సూకరాజు, తిక్క అశోక్, గాలి రాజు, గోసాల దేవుడు, గోశాల రాజు, అర్జిల్లి సూరిబాబు, తిక్కన కాశీరావు, మైలపల్లి చినబాబు, తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యువనేత యనమల రాజేష్, తొండంగి మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, మహంకాళి, కొయ్య మల్లేష్, శివాజీ, తదితరులు ఉన్నారు.

స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ ప్లాన్ తయారీపై వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలకు చెందిన మండల, గ్రామ, సచివాలయ స్థాయి ఉద్యోగులకు స్వర్ణ ఆంధ్ర- 2047 విజన్ ప్లాన్ తయారీపై మంగళవారం గండేపల్లి మండలం నీలాద్రి రావుపేట గ్రామ శివారు పరిణయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎస్‌వి.సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్ పీడీ హౌసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సీపీవో శ్రీ త్రినాథ, డీహెచ్‌వో మల్లిఖార్జునరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో కిషోర్ బాలికలతో ప్రదర్శన



ధర్మవరంలో కిషోర్ బాలికల ర్యాలీ దృశ్యం

ప్రత్తిపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిషోర్ బాలికలతో ప్రదర్శన నిర్వహించారు. నంది సెంటర్ నుంచి పశువుల ఆసుపత్రి సెంటర్‌లోని పంచాయతీ కార్యాలయం వరకు కొనసాగింది. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, సూపర్‌వైజర్ జి.చక్రవేణి మాట్లాడుతూ కిషోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఐరన్, విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని తరుచూ మంచినీరు తాగాలని, తగిన నిద్ర ఉండాలని, రుతు నొప్పి నుంచి ఉపశమనం కోసం తేలికపాటి వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో 14 అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, కిషోర్ బాలికలు, మహిళా పోలీస్ చాందిని, శ్రీ పూర్ణ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పరిశీలన

వీఆర్‌పురం, మే 6(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన వీఆర్‌పురం బీసీ కాలనీ నుంచి రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయం వరకు అసం పూర్తిగా వేసి వదిలేసిన రోడ్డును చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మంగళవారం పరిశీలించారు. ఈవిషయంపై ఎంపీపీ కారం లక్ష్మి పీవో దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన తారురోడ్డు వేయకుండా వెట్‌మిక్స్ వేసి వదిలేసిన రోడ్డును పరిశీలించారు. ఈవిషయమై తదికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కార్యక్ర మంలో సీపీఎం నాయకులు పులి సంతోష్‌కుమార్, కారం సుందర య్య, పొడియం శ్రీరామూర్తి, పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పెద్దనాపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

ఏలేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మంగళవారం పెద్దనాపల్లి గ్రామంలో మండల నిధులతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఎటువంటి అవకతవకలు లేకుండా పనులు చేపట్టాలన్నారు. నాణ్యత లోపించకూడదని అధికారులకు సూచించారు. టీడీపీ నాయకులు సుంకర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు స్థలపరిశీలన



గండేపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న గ్రామస్థులు

గండేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): గండేపల్లి కృష్ణుడి గుడివీధిలో గ్రామస్తుల కోసం బోరును ఏర్పాటు చేసేందుకు మంగళవారం గ్రామ నాయకులు స్థల పరిశీలన చేశారు. బోరు ఏర్పాటుకు మాసిన సత్తిబాబు స్థలాన్ని ఇవ్వగా గ్రామస్తులు, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశి, వెంపాటి రాజు, లంజుపల్లి రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న, బొల్లిన వేణు, నాలం వీరబాబు, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు



ప్రత్తిపాడులో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రత్తిపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): మే 20న జాతీయ సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు పాల్గొనేందుకు మంగళవారం మండలంలోని పంచాయతీ కార్మికులు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుకు నోటీసు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావుతో కలిసి పంచాయతీ కార్మికుల యూనియన్ మండలాధ్యక్షుడు పోసపల్లి రమణ తదితరులు నోటీసును అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌ను తక్షణం రద్దు చేసి కార్మికులకు 132, 142, 680 జీవోలను వెంటనే అమలుచేసి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

గర్భిణులు జాగ్రత్త పాటించాలి

ప్రత్తిపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ సూచించారు. యర్రవరం వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని, పౌష్టికాహార పంపిణీని ఆమె ప్రారంభించారు. సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవ కల్యాణానికి తరలిరండి

ప్రత్తిపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుణి వార్షిక దివ్యకల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని సత్యదీక్ష ప్రచారకార్యకర్త నల్లమిల్లి కృష్ణబాబు కోరారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల్లో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 7 నుంచి 13 వరకు అన్నవరంలో కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు.

శెట్టిబత్తులకు పీహెచ్‌డీ



అన్నవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వృద్ధాశ్రమంలో వృద్ధుల జీవిత సంతృప్తి, సామాజిక ఆర్థిక మద్దతులపై అధ్యయనంపై అన్నవరానికి చెందిన శెట్టిబత్తుల ప్రకాష్‌బాబుకు ఆంధ్రాయూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అవార్డు లభించింది. ప్రస్తుతం ఏయూలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ని గ్రామస్థులు అభినందించారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశం వాయిదా

రంపచోడవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన జరగాల్సిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం అనివార్య కారణాలతో వాయిదా వేయడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మంగళవారం ప్రకటనలో తెలిపారు. సదరు విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు గమనించాలని కోరారు.

లబ్బర్తిలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు

రాజవొమ్మంగి, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో లబ్బర్తిలో శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాల లోపు యువతులతో కిషోరి వికాసం సమ్మర్ క్యాంపెన్ మంగళవారం నిర్వహించారు. సీడీపీవో దేవమణి మాట్లాడుతూ రుతుస్రావం, పరిశుభ్రత, ఆరోగ్యం, శ్రేయస్సు వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిరియాల సత్యవతి, సెక్రటరీ వరాలయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రసూతి సెలవుల పెంపుపై హర్షం

రంపచోడవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు 120 రోజుల నుంచి 180 రోజులు పెంపుపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లండా వెంకటేశ్వర్లు, బోండ్ల వరప్రసాద్ హర్షం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవోఎంఎస్ నెం.21, తేదీ. 05-05-2025 ద్వారా ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ పిల్లలు ఉన్న ఉద్యోగులకు ప్రసూతి సెలవులు పెంచడం ద్వారా జనాభా పెరుగుదలకు దోహదపడడమే కాకుండా దేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఎదగడానికి సీఎం చంద్రబాబు ముందు చూపేనన్నారు.

పీసా ఎన్నికలు మళ్లీ వాయిదా

వై.రామవరం, మే 6(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మంగళవారం నిర్వహించ తలపెట్టిన పీసా గ్రామసభ ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. గ్రామసభలో కోరంకు సంబంధించిన ఓటర్లు హాజరుకాకపోవడంతో వాయిదా పడినట్లు ఎంపీడీవో బాపన్న దొర తెలిపారు. దీంతో ఇప్పటికీ ఈ పీసా ఎన్నికలు పది సార్లు వాయిదా పడ్డాయి.

కొనసాగుతున్న టీడీపీ గ్రామసభలు

దేవీపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుదేశం పార్టీ గ్రామ సభలు కొనసాగుతున్నట్లు మండల కన్వీనర్ మరిశేట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. డీఎస్ పాలెం, పాముగండి, సీహెచ్ ఆర్ పేట, శరభవరం, తున్నూరు గ్రామాల్లో ఏకగ్రీవంగా గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులతో, బూత్ కన్వీనర్లు, కోక్ కన్వీనర్లను నియమించారు. ఈ కార్యక్రమంలో అడహాక్ కమిటీ సభ్యులు మాగావు బాబురావు, ముంద్రు మదుసూదన్ రావు, గొళ్ళ చంటి, తైలం గంగాధర్ రావు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, ముచ్చి వీర వెంకట సత్యనారాయణ, జొన్నల నాని,తదితరులు ఉన్నారు.

సీహెచ్‌వోలు క్షమాపణలు చెప్పాలి

ఎటపాక, మే 6 (ఆంధ్రజ్యోతి):సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలను ఉద్దేశించి అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేసిన సీహెచ్‌వోలు, అసోసియేషన్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నెల్లిపాక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమకు క్షమాపణలు చెప్పాలని కోరారు. అనంతరం చింతూరు డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యకు వినతి పత్రంను అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారిణి గౌతమి, డాక్టర్ నాగమణి, పీహెచ్ఎన్ అరుంధతి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు సకాలంలో అందించాలి

రంపచోడవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు సకాలంలో అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం సాయంత్రం ముసురుమిల్లి గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టిహాకారం అందిస్తున్న తీరును పరిశీలించారు.